సాక్షి తిరుపతి

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

శ్రీనివాసమంగాపురంలోని కల్యాణవేంకటేశ్వస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేశారు. - 8లో



సహకార సంఘాల్లో సభ్యులుగా రైతులు

ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో రైతులందరూ సభ్యులుగా ఉండాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. - 8లో



బెంచీలకు పసుపు రంగులా?

చంద్రగిరి నియోజకవర్గంలో గతంలో ఏర్పాటు చేసిన బెంచీలకు పసుపు రంగులు వేయడం దూమారం రేపింది. - 8లో

న్యూస్‌రీల్

ఈ-ఫైలింగ్‌పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డీఎం మమత

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ సావేరీ సెమినార్ హాల్ వేదికగా పేటెంట్ అప్లికేషన్ డ్రాఫ్టింగ్ అండ్ ఫైలింగ్ విధానాలపై జరుగుతున్న జాతీయ సదస్సులో నాలుగో రోజు పలు అంశాలపై అధ్యాపకులు, ఆవిష్కర్తలు, పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, ప్రొఫెసర్ డీఎం మమత మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా దేశావ్యాప్తంగా గుర్తింపు పొందిన నిపుణులు పేటెంట్ హక్కుల పరిరక్షణపై విలువైన సలహాలు, సూచనలు అందించారని, నూతన ఆవిష్కర్తలు, భావిభారత పరిశోధకులకు ఎంతో ఉపయోకరమని తెలిపారు. ప్రధానంగా ఆవిష్కరణల పేటెంట్ హక్కుల్లో భాగమైన ఈ-ఫైలింగ్ విధానం, పేటెంట్ శోధన సాధనాలపై మెలుకువలు, సూచనలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖకు చెందిన నోవెల్ పేటెంట్ సర్వీస్ మేనేజర్ ఎస్వీఏఎన్ రాజు, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీస్వామి, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది విజయ్ కుమార్, అధ్యాపకులు, పరిశోధకులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

16న టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 8 గంటలకు తిరుపతిలోని ఎస్వీజేఎస్ఎం హైస్కూల్ క్రీడా మైదానంలో సీనియర్ స్త్రీ, పురుషుల టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఎంపికైన జిల్లా జట్టు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు చంద్రగిరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 94902 52821 నంబర్‌లో సంప్రదించాలని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.దేవరాజ్, బి.మనోహర్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ఎంసీఏ, ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ఎంసీఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలు, అలాగే ఐదేళ్ల, మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు సంబంధించి గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన నాలుగో సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వేదనే తరుణం?

రాయితీ రుణాలు.. తక్కువ యూనిట్లు.. దరఖాస్తులు కోకొల్లలు.. యాభై శాతం రాయితీ కారణంగా అధిక సంఖ్యలో పోటీ పడుతున్న లబ్ధిదారులు.. ఎవరికి వారు ముమ్మర ప్రయత్నాలు.. రాజకీయ నేతల జోక్యాలు.. అన్ని అర్హతలున్నా పెద్దల అభయం ఉన్న వారికే దరిచేరే అవకాశాలు.. ఈ క్రమంలో నిజమైన పేదలకు బీసీ రుణం అందడం గగనమేనా? అని పలువురు చర్చించుకుంటున్నారు.



కార్పొరేషన్ రుణాల్లో కూటమి చేతి వాటం

- దామాషా ప్రకారం పంచుకోవాలని చర్చలు
- టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు ఇవ్వాలనే డిమాండ్
- 1,961 యూనిట్లకు 13,844 మంది దరఖాస్తులు
- గడువు ముగియక ముందే లాబీయింగ్ మొదలు
- ఈ నెల 15తో ముగియనున్న గడువు

12 వరకు వచ్చిన దరఖాస్తులు

కులం	మంజూరైన యూనిట్లు	వచ్చిన దరఖాస్తులు
బీసీ కార్పొరేషన్	1,174	11,574
బ్రాహ్మణ	9	35
ఈబీసీ	89	201
కమ్మ	69	249
క్షత్రియ	8	67
రెడ్డి	54	260
వైశ్య	12	105
కాపు	564	1437
మొత్తం	1,979	13,928

తిరుపతి అర్బన్ : కూటమి సర్కార్ విడుదల చేసిన బీసీ కార్పొరేషన్, స్వయం ఉపాధి రుణాలకు అధిక పోటీ నెలకొంది. 50 శాతం రాయితీతో అందిస్తున్న ఈ రుణాలను దక్కించుకోవడానికి పలువురు ఆశావహులు ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో 1,979 యూనిట్లకు 13,928 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి మరో రెండు రోజులు సమయం ఉంది. ఈ నెల 15వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి 50 శాతం రాయితీలు కల్పించనున్నారు. మిగిలిన 50 శాతం మొత్తాన్ని బ్యాంక్ రుణం కట్టాల్సి ఉంటుంది. 1,979 యూనిట్లకు సంబంధించి రూ.75 వేల నుంచి రూ.10 లక్షల యూనిట్ల వరకు విభజన చేశారు. వ్యక్తిగత యూనిట్ల నుంచి గ్రూపు యూనిట్ల వరకు ఇందులో ఉన్నాయి. ప్రధానంగా బీసీ కార్పొరేషన్ యూనిట్లకు అత్యధిక పోటీ నెలకొంది. 1,174 యూనిట్లకు 11,574 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే ఒక్కో యూనిట్‌కు 10 మందికి పైగా పోటీ పడుతున్నారు. అయితే మరో మూడు రోజులు గడువు పెంచడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనాలు వేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ కూటమి సర్కార్ నేతల అండదండలు లేకుంటే కార్పొరేషన్ రుణాలు దక్కేలా లేవని తెలుస్తోంది. దీంతో ఎవరి ప్రయత్నాల్లో వారు జోరుగా అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు చర్చసాగుతుంది.

మొదలైన లాబీయింగ్

కూటమి సర్కార్‌లో టీడీపీతోపాటు జనసేన, బీజేపీలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తమ శాతాన్ని తమకు ఇవ్వాలని జనసేన, బీజేపీలు పట్టుపడుతున్నాయి. ఇటీవల ఇరిగేషన్ పరిధిలో నిర్వహించిన ఆయకట్టులోనూ పలు స్థానాలు బీజేపీ, జనసేన నేతలు పొందారు. అలాగే వారం రోజుల క్రితం జిల్లాలో ప్రకటించిన 12 వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల పదవుల్లోనూ బీజేపీ, జనసేన తమ శాతం తమ పార్టీ నేతలకు ఇవ్వాలని పట్టుపడుతున్నట్లు చర్చ జోరుగా సాగుతుంది. ఈ క్రమంలో తాజాగా జారీ చేసిన బీసీ కార్పొరేషన్ రుణాల్లో 1,979 యూనిట్లకు 50 శాతం టీడీపీ తీసుకున్నా, మిగిలిన 50 శాతంలో బీజేపీ, జనసేన నేతలు దక్కించుకోవడానికి సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా అందరిలోనూ సబ్సిడీ రుణాలు పొందాలనే ఉద్దేశంతో నేతలను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు.

పేదోడికి ఇవ్వండి



బీసీ కార్పొరేషన్ రుణాలను పేదోడికి ఇవ్వండి. కూటమి సర్కార్ నేతలకు ఇవ్వడం ద్వారా ప్రయోజనం లేదు. ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ పథకాలు ఇప్పటి వరకు సక్రమంగా ఇవ్వలేదు. తాజాగా బీసీ కార్పొరేషన్ రుణాలు ఇస్తున్నారు. వాటినైనా అర్హులైన వారికి మాత్రమే కేటాయించాలని కోరుతున్నాం. అంతేతప్ప పార్టీల వారీగా పంచుకుంటే నిజమైన పేదోడికి ప్రయోజనం ఉండదనే విషయాన్ని అధికారులు గుర్తించాలి. నేతలు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నాం.

-వెందొటి సుధాకర్, చిట్టమూరు మండలం, బీసీ నేత

అర్హులైన బ్రాహ్మణులకు ఇవ్వండి



బ్రాహ్మణులకు కేటాయించిన యూనిట్లు కేవలం 9 మాత్రమే. ఆ తొమ్మిది యూనిట్లను నిజమైన అర్హులకు ఇవ్వాలని కోరుతున్నాం. అప్పుడే వారికి సంతృప్తి ఉంటుంది. ఆ రుణం విలువ తెలుస్తుంది. రాయితీ వస్తుందని ఉన్నవాడే రుణం తీసుకోవడం ద్వారా ప్రయోజనం ఉండదని భావిస్తున్నాం. ఈ క్రమంలో అధికారులు ఒకటికి రెండు సార్లు దరఖాస్తులను పరిశీలించడంతోపాటు వారి ఆర్థిక సోమత్తను గుర్తించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరుతున్నాం. అంతేతప్ప సిఫార్సులను ప్రామాణికంగా తీసుకుంటే ప్రయోజనం ఉండదు.

-కృష్ణమూర్తి, బ్రాహ్మణ నేత, తిరుపతి

అర్హులకే మంజూరు చేయాలి



ప్రభుత్వం అందిస్తున్న బీసీ కార్పొరేషన్ రుణాలను పారదర్శకంగా ఇవ్వాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎవరు అర్హులుగా ఉన్నారో వారికే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన 9 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు సూపర్ సిక్స్ అందించలేదు. బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వడంతో అంతా వాటిపైనే ఆశ పెట్టుకున్నారు. అధికారులు ఈ అంశాన్ని గుర్తించి న్యాయబద్ధంగా వ్యవహరించాలని కోరుతున్నాం.

-చిందేటి వెంకటేశ్వర్లు, బీసీ నేత, నాయుడుపేట

న్యాయంగా ఇవ్వండి



నేతలు చెప్పారని రుణాలు ఇవ్వకుండా న్యాయబద్ధంగా రుణాలు ఇవ్వాల్సి ఉంది. నిజమైన అర్హులకు రుణాలు ఇవ్వండి. మా యాదవ్ కులంలోనూ పేదోళ్లకు ఇవ్వండి. అంతేతప్ప ఇష్టారాజ్యంగా రుణాలు ఇస్తే తిరుగుబాటు తప్పదు. కార్పొరేషన్ రుణాలపై గంపెడు ఆశలో బీసీలు ఎదురుచూస్తున్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని రుణాలు కేటాయించాల్సి ఉంది. అధికారులు నేతల ఒత్తిడికి తలొగ్గకుండా ఉండాలి. ఎమ్మెల్యేలు జోక్యం ఉండకూడదు.

- వెంకటేష్‌యాదవ్, బీసీ నేత

పారదర్శకంగా ఇవ్వండి



కాపులకు జిల్లాలో 564 యూనిట్ల వరకు కేటాయించినట్లు పత్రికల్లో చూశాం. ఇప్పటికే 1400కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తుంది. అయితే ఈ రుణాలను గతంలో తీసుకున్న వారికే మళ్లీ ఇవ్వకుండా నిజమైన అర్హులకు ఇవ్వాలని కోరుతున్నాం. 50 శాతం సబ్సిడీతో ఇస్తున్న రుణాలు అయినందున మనపార్టీ వాళ్లకే ఇద్దామని భావిస్తే పెద్ద ఎత్తున చెడ్డ పేరు వచ్చే ప్రమాదం ఉంది. రుణాలు పంపిణీలో పేదోళ్లకు న్యాయం చేయాలని తెలియజేస్తున్నాం.

-మద్దాలి శేఖర్, బలిజ సంఘం నేత

జలజీవన్ మిషన్ వందశాతం అమలు చేయండి



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి అర్బన్: వేసవి నేపథ్యంలో తిరుపతి జిల్లాలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జలజీవన్ మిషన్ పథకాన్ని కచ్చితంగా వందశాతం అమలు చేయాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూరి పార్లమెంట్‌లో గురువారం అన్నారు. దీనిపై కేంద్ర జలశక్తి సహాయ మంత్రి వి.సోమన్న స్పందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్లు ఇవ్వడంలో భాగంగా 2019లో జలజీవన్ మిషన్ పథకాన్ని ఏపీలో ప్రారంభించామని చెప్పారు. గత ఐదేళ్లలో తిరుపతి జిల్లాలో 1.76 లక్షల కొత్త కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. మిగిలిన వారికి కనెక్షన్లు తప్పకుండా ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలు, బీసీలు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. తిరుపతి జిల్లాలో 4,018 హాబిటేషన్లు ఉండగా అందులో ఎస్సీల హాబిటేషన్లు 1,331లో 1328, ఎస్టీల 487గాను 485లో కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ 55 లీటర్ల తాగునీరు రోజుకు అందించే లక్ష్యం కోసం జల్ జీవన్ మిషన్ వేగంగా పురోగమిస్తోందన్నారు. తిరుపతి జిల్లాలోని 908 గ్రామాల్లో 901 గ్రామాలకు నీరు, పారిశుద్ధ్య కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 50 శాతం మహిళలకు కమిటీ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

దేవుడితో రాజకీయాలా బాబూ!

- ప్రసాదంపై రాజకీయం చేశారు.. పరిణామం ఎదుర్కొన్నారు
- సనాతన ముసుగులో దేవాలయాల పవిత్రతను దిగజారుస్తున్న పవన్‌కళ్యాణ్
- ముంతాజ్ హోటల్‌కు అనుమతులు రద్దు చేయాలి
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : 'కోట్లాది మంది భక్తులు ఎంతో పవిత్రంగా బావించే తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ జరగలేదు. శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాదంపైన రాజకీయం చేస్తున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బుర్రల్లో కల్తీ జరిగింది.' అని టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు. తిరుపతి పద్మావతిపురంలోని ఆయన నివాసంలో గురువారం మీడియాతో మాట్లాడారు. తిరుమల లడ్డూలో ఎక్కడా కల్తీ జరిగినట్లు సిట్ కూడా నిర్ధారించలేదన్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి వాడినట్లు సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిందితుల రిమాండ్ రిపోర్టులో ఎక్కడా ప్రస్తావించకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. నెయ్యి సరఫరాలో భోలే బాబా డెయిరీ, వైష్ణవి డెయిరీ, ఏఆర్ డెయిరీ చేసిన తప్పులపై మాత్రమే సిట్ విచారణ జరిపి నలుగురిని అరెస్టు చేసిందన్నారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం సాక్ష్యాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపైనే రాజకీయం చేసిన దుర్మార్గులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అని మండిపడ్డారు. వాళ్లు చేసిన పాపాలకు వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతి చెందడం, 50 మందికి పైగా క్షతగాత్రులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ముసుగులో పవన్‌కళ్యాణ్ తిరుమలతోపాటు దేవాలయాల పవిత్రతను దిగజారుస్తున్నారని మండిపడ్డారు.

వేషం కట్టి.. బిల్డప్ ఇచ్చి

సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఆవిర్భవించినట్టుగా పవన్ వేషం కట్టి బిల్డప్ ఇచ్చారని భూమన ధ్వజమెత్తారు. అయోధ్య ఆలయం ప్రారంభోత్సవానికి కూడా కల్తీ నెయ్యితో తయారు చేసిన లడ్డూలే పంపారని తీవ్రమైన ఆరోపణలు చేశారని, అదే నిజమైతే చంద్రబాబు టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించిన ముంబయికి చెందిన సౌరభ్ బోరానే ముందుగా అరెస్టు చేయాలని చెప్పారు. అయోధ్యకు పంపిన లక్ష లడ్డూల తయారీకి నెయ్యిని సరఫరా చేసింది, సౌరభ్ బోరానే అని తెలిపారు. కల్తీ జరిగిందని సిట్ రిమాండ్ రిపోర్టులో చెప్పకపోయినా చంద్రబాబు లడ్డూలో కల్తీ జరిగిందని పదే పదే చెబుతుండడంపై ఇప్పటికే సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. శ్రీవారి పాదాల చెంత అలిపిరి మార్గంలో ముంతాజ్ హోటల్ నిర్మాణానికి చంద్రబాబు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సనాతన ధర్మపరిరక్షకుడు పవన్‌కి చంద్రబాబు చేసే ఇలాంటి దుశ్చర్యలు కనిపించవా? అని ప్రశ్నించారు. నిజంగా సనాతన ధర్మాన్ని కాపాడే వాడేవాడైతే టీటీడీ పరిపాలన భవనం వద్ద స్వామీజీలు చేస్తున్న నిరాహారదీక్షకు పవన్‌కళ్యాణ్ మద్దతు ఇవ్వాలన్నారు. ప్రత్యర్థి పార్టీలను నాశనం చేసేందుకు కాషాయం దుస్తులు ధరించి సనాతన ధర్మపరిరక్షుడిగా నాటకమాడుతున్నాడని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మోసపూరిత రాజకీయాలను ప్రజలంతా గ్రహిస్తున్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రాజకీయ కక్షతోనే వల్లభనేని వంశీ అరెస్టు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే టార్గెట్‌గా చేసుకుని అక్రమ కేసులు, దాడులు చేస్తున్నారని భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే తరహాలోనే గురువారం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి అరెస్టు చేశారన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏ నాడూ ఇలాంటి అరెస్టులు, దాడులు జరగలేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో నారా లోకేష్ చెప్పిన రెడ్‌బుక్ పాలనను కొనసాగిస్తూ రాజకీయ కక్షతో తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. చంద్రబాబు అరాచక పాలన ఎంతో కాలం సాగదని హెచ్చరించారు. కూటమి అరాచకాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయం పాటించాలని, వైఎస్సార్‌సీపీకి తిరిగి మంచి రోజులు వస్తాయని చెప్పారు.

కళ్లున్న ధృతరాష్ట్రులు

చూడలేరా?

ఆర్థిక సంఘం నిధులు అభివృద్ధికి ఆలవాలం..అయితే రాజకీయ నేతల ప్రచార ఆర్భాటం.. అందరి దృష్టిలో పడాలన్న ఆరాటం..అధికారుల నిర్లక్ష్యం.. ఉన్నది కొట్టేసి మళ్లీ కొత్తగా నిర్మాణం.. వెరసి..ఆ ధనం వృథా..అభివృద్ధికి ఆమడ దూరంలో శ్రీకాళహస్తి పట్టణం.. ఇంత జరుగుతున్నా పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు.. ప్రభుత్వం.. కళ్లున్న ధృతరాష్ట్రుగా చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కొత్త డివైడర్ కోసం నాటిన ఇనుప చువ్వలు

- భేషుగ్గా ఉన్నా కొట్టేసి.. మళ్లీ నిర్మాణం
- కొత్త డివైడర్‌కు దాదాపు రూ.95 లక్షలు వ్యయం
- 9 అంగుళాల పెంపునకు రూ.53 లక్షలు
- ముక్కున వేలేసుకుంటున్న స్థానికులు

శ్రీకాళహస్తి: పట్టణవాసులు సేద తీరడానికి పార్కులు లేకున్నా మున్సిపల్ అధికారులకు చీమ కుట్టినట్లయినా లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయని ఏపీ సీడ్స్ వద్ద ఉన్న ఆర్చీ నుంచి రామసేతు వంతెన వరకు బాగున్న డివైడర్‌ను కొట్టేసి, కొత్త డివైడర్‌ను నిర్మిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి, తొమ్మిది నెలలు కావస్తున్నా కొత్తగా నిర్మాణాలు చేపట్టకపోగా ప్రచార ఆర్భాటం, అందరి దృష్టిలో పడాలన్న ఉద్దేశంతో 15వ ఆర్థిక సంఘం నిధులను ఇలా వృథా చేస్తున్నారు. శ్రీకాళహస్తి ఆర్చీ వద్ద నుంచి రామసేతు వంతెన వరకు బాగున్న డివైడర్‌ను తొలగించి, 9 అంగుళాలు పెంచి మళ్లీ నిర్మించారు. ఇందుకోసం రూ.53 లక్షలు పురపాలక నిధులను ఖర్చు పెట్టడంపై పట్టణంలో సర్వత్రా చర్చ నడుస్తోంది. 2020–21కి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులతో బ్యూటీఫికేషన్ కోసం గత ప్రభుత్వంలో శ్రీరామ్‌నగర్‌కాలనీ పార్కు అభివృద్ధి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే ఆ నిధులు గతంలో రాకపోవడంతో ఆ పనులు ఆగిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో శ్రీకాళహస్తిలో ఎన్టీఆర్ పార్కు, శ్రీరామ్‌నగర్‌కాలనీ, మంచినీళ్లగుంట వద్ద పార్కులను నిర్మిస్తారని అందరూ అనుకున్నారు. అయితే ఆ దిశగా కూటమి నాయకులు అడుగు వేయకుండా ఉన్న డివైడర్‌ను కొట్టి 9 అంగుళాలు పెంచి, లోపల పాత మొక్కలను తొలగించి, కొత్త మొక్కలు నాటారు. పాత మొక్కలు ఏమీ చేశారో ముక్కంటికే ఎరుక.



డివైడర్ మధ్యలో లేని వీధి దీప స్తంభం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

గత టీడీపీ హయాంలో ముత్యాల పార్థసారథి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నపుడు ఈ డివైడర్‌పై డివైడర్ వేసి పసుపు రంగు వేసి వదిలేశారు. కింద డివైడర్ ఉండడంతోనే చెట్లు పెరగడంలేదని నేడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో డివైడర్‌ను తొలగించి కొత్త డివైడర్ నిర్మిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా యుద్ధప్రాతిపదికన పనులను మమ అనిపించేశారు.


సమాచారం

డివైడర్ నిర్మాణ వ్యయం	రూ.53 లక్షలు
స్టోన్ ఆర్నమెంట్ పిల్లర్లకు	రూ.30 లక్షలు
మొక్కలు నాటడానికి	రూ.12 లక్షలు

ప్రణాళిక లోపం

డివైడర్లలో 30 అడుగులకు ఒక మొక్క నాటడానికి, ఒక ఆర్నమెంట్ స్టోన్ పిల్లర్ ఏర్పాటుకు ఈ డివిడర్‌ను పెద్దది చేశామని అధికారులు చెబుతున్నారు. అయితే 30 అడుగుల దూరంలో ఒక చెట్టును నాటడానికి డివైడర్‌ను ఎందుకు కొట్టారనేది చర్చనీయాంశంగా మారింది. దాని మధ్యలో ఉన్న వీధిదీపాలను మధ్యలోకి జరప కుండా అలాగే ఉంచడంతో చూడటానికి తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అవన్నీ ప్రజలు పట్టించుకోరనుకున్నారేమో వాటికి పెయింటింగ్ వేసి, చేతులు దు లుపుకున్నారు. అధికారులను దీనిపై వివరణ కోరగా పురపాలకసంఘ కమిషనర్, ఎమ్మెల్యే ఆదేశాలతో ప నులు చేశామన్నారు. బస్సు మార్గం సుందరంగా చేయాలనే ఉద్దేశంతో ఈ పనులు చేశామన్నారు. బ్యూటిఫికేషన్ కోసమే ఆ నిధులు రావడంతో మొక్కలు నాటామని చెప్పారు.

భావిభారతానికి జ్ఞానసంపద అందాలి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న డాక్టర్ సూర్యప్రసాద్

తిరుపతి సిటీ: భారతీయ భాషల్లోని జ్ఞాన సంపదను భావిభారతానికి అందించాలని, అందుకు మేధోసంపత్తిగల పుస్తక రచనలు జరగాలని కేంద్రీయ సంస్కృత వర్సిటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సూర్యప్రసాద్ అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, భారతీయ భాషా సమితి, కేంద్రీయ సంస్కృత వర్సిటీ, తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఎస్‌యూ వేదికగా రెండు రోజుల పాటు జరిగే భారతీయ భాషల్లో పుస్తక రచయితలకు సంబంధించి వర్క్‌షాపును గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉన్నత విద్యకు సంబంధించిన పుస్తక రచనలు, అనుసరించాల్సి నిబంధనలు, పుస్తక రచనలో ఆకర్షణీయత ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీనివాస వర్కేడి, ప్రొఫెసర్ చాంద్‌కిరణ్, ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణ, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ, అకడమిక్ డీన్ రజనీకాంత శుక్లా, సచ్చిదానందమూర్తి, శేఖర్ రెడ్డి, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 50 మందికి పైగా పుస్తక రచయితలు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.88,420
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,973
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.98,500
రిటైల్ వెండి గ్రాము	రూ.101.50

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత సూరా మధుసూదనరెడ్డి


టీడీపీ నేత మధుసూదనరెడ్డికి కండువా కప్పుతున్న రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత సూరా మధుసూదనరెడ్డి గురువారం వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతోపాటు ఆయన అనుచరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన చేరికతో వైఎస్సార్‌సీపీకి మరింత బలం చేకూరిందని రాజేష్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, పార్టీ మండల కన్వీనర్ మణినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపాల్ రెడ్డి, గురునాథం, మునిరెడ్డి, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, నాయకులు ప్రసాద్‌పాల్, శ్రీరాములురెడ్డి, పెంచలయ్య పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి కేసులో నిందితులకు పోలీస్ కస్టడీ

తిరుపతి లీగల్ : తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో రిమాండ్‌లో ఉన్న నలుగురిని ఐదు రోజులు పాటు పోలీస్ కస్టడీకి ఇస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీ.కోటేశ్వరరావు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. కేసు విచారణ నిమిత్తం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నలుగురిని ఇంకా విచారించాల్సి ఉందని, వారిని పోలీస్ కస్టడీకి ఇవ్వాలంటూ సీబీఐ సిట్ అధికారులు కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై గురువారం వాదనలు జరిగాయి. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జయశేఖర్, గోపి వాదించారు. అలాగే అరెస్టయి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న మూడు డెయిరీల అధికారుల న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవిస్తూ జడ్జి శుక్రవారం నుంచి ఐదు రోజులపాటు నలుగురిని పోలీస్ కస్టడీకి ఇస్తూ ఉత్తరవులు జారీచేశారు.

కాలేజీలపై నిఘా

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు గురువారం తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీ, ఎస్వీ డిఫెన్స్ అకాడమీ వసతి కేంద్రాలను తనిఖీ చేశారు. భోజనంను పరిశీలించారు. పిల్లలతో కలిసి భోంచేశారు. విద్యార్థులు బస చేస్తున్న గదుల్లో బ్యాగులను తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు కాలేజీ, వసతి కేంద్రాల వద్దకు వస్తుంటే సమాచారం ఇవ్వాలని నిర్వాహకులు, వార్డెన్లు, అధ్యాపకులకు సూచించారు.

విషమపరీక్ష

పుస్తకాలు పంపిణీ చేయలేదు.. తరగతులు నిర్వహించలేదు.. రెండు నెలల కిందటి వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగించింది.. ఆ తంతు ముగిసిన నెలలోపే పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ తతంగం చూస్తే విద్యార్థులు విషమ 'పరీక్ష'ను ఎదుర్కోబోతున్నారు. రాష్ట్రంలో ప్రశాంతవాతావరణంలో పరీక్షలు రాసే వెసులుబాటు లేకుండా పోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- రెగ్యులర్‌తోపాటు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు
- షెడ్యూల్ విడుదలపై విస్మయం

తిరుపతి ఎడ్యుకేషన్ : పుస్తకాలు అందలేదు. తరగతులు జరిగిందీ లేదు. అయినా ఈ ప్రభుత్వం ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ తీరుపై విద్యార్థులు మండి పడుతున్నారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా పది, ఇంటర్ విద్యార్థులకు రెగ్యులర్‌తో పాటు పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇంతవరకు పుస్తకాలను పూర్తి స్థాయిలో అందించలేదు.. తరగతులు ప్రారంభం కాలేదు. అప్పుడే పరీక్షలంటూ ఉత్తర్వులు రావడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి గత ఏడాది జూలై 31న ఏపీ సార్వత్రిక విద్యాపీఠం నోటిఫికేషన్ జారీ చేసింది. అడ్మిషన్లకు సంబంధించిన ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించి దరఖాస్తులను స్వీకరించింది. అపరాధ రుసుం లేకుండా నవంబర్ నెలాఖరు వరకు, డిసెంబరు 23 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు అపరాధ రుసుంతో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు పరీక్షల ఫీజును స్వీకరించింది. తిరుపతి జిల్లా నుంచి పదో తరగతికి 1,019 మంది, ఇంటర్మీడియట్‌లకు 2,838 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు.

ఆందోళనలో విద్యార్థులు

సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పది, ఇంటర్ చదివే విద్యార్థులకు వారు ఎంచుకున్న సబ్జెక్టుల పుస్తకాలతో పాటు మెటీరియల్‌ను అందిస్తుంది. అయితే పది, ఇంటర్ విద్యార్థులకు అరాకొరగా పుస్తకాలను అందాయి. ఓపెన్ స్కూల్ నిబంధనల మేరకు కనీసం 30 తరగతులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కొన్ని కేంద్రాల్లో తరగతులు ప్రారంభం కాలేదు. సెలవు రోజులతో పాటు ఎంపిక చేసిన రోజుల్లో ఈ తరగతులను నిర్వహిస్తారు. ఇప్పటి నుంచి తరగతులు నిర్వహించినా 30 తరగతులను నిర్వహించడానికి ఆస్కారం లేదు. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్, 17 నుంచి పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జనవరి 20న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో నెల 17 రోజుల్లో ఇంటర్, 35 రోజులో పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. రెగ్యులర్‌తో పాటు పరీక్షలు నిర్వహిస్తే ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసే విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


ఆలయ ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ స్పెషల్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి

- 17న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం గురువారం వేడుకగా జరిగింది. ఫిబ్రవరి 18 నుంచి 26వ తేదీ వరకు ఆలయంలో కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

17న అంకురార్పణ

కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఫిబ్రవరి 17వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతి రోజూ వాహన సేవలు ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య, రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య జరుగనున్నాయి. 23వ తేదీన సాయంత్రం 4గంటలకు స్వర్ణ రథం, 25వ తేదీన ఉదయం 8.40 గంటలకు రథోత్సవం, 26వ తేదీన ఉదయం 10 గంటలకు చక్రస్నానం జరుగనుంది.

పరదాలు సమర్పణ

తిరుపతికి చెందిన పరదాల మణి రెండు పరదాలు, రెండు కురాళాలను ఆలయానికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, ఆలయ అర్చకులు నారాయణ చార్యులు, సూపరింటెండెంట్ రాజ్ కుమార్, ఇతర అధికారులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో సభ్యులుగా రైతులు


మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో రైతులందరూ సభ్యులుగా ఉండాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో సంఘాలను మరింత బలోపేతం చేయాలని చెప్పారు. ప్రాథమిక సహకార పరపతి సంఘాలను టెక్నాలజీ వినియోగించి కంప్యూటరైజేషన్ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సహకార రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడానికి ఉద్యాన, వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధకశాఖలు సహకరించాలని సూచించారు. ఆమేరకు సంఘాల్లోను సభ్యులకు డీసీసీబీ, నాబార్డ్ నుంచి రుణాలు అందించాలని తెలిపారు. జిల్లా సహకార అధికారి, కన్వీనర్ ఎస్.లక్ష్మి నెలలవారీగా ఏడాదిపాటు సహకార సంఘాలు చేపట్టే కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు, డీడీఎం నాబార్డ్ సునీల్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి శేషాచలం రాజు, మేనేజర్ వై. సుమతి, మత్స్యశాఖ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలకు చెక్ పెట్టండి

మాత,శిశు మరణాలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యశాఖాధికారి బాలకృష్ణనాయక్‌తో కలసి వైద్యాధికారులతో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలతో టీనేజీ ప్రెగ్నెన్సీ సమయంలో కలిగే ఆరోగ్య సమస్యలపై ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, శిశు సంక్షేమ శాఖా సిబ్బంది అవగాహన కల్పించాలని చెప్పారు.హైరిస్క్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్యాధికారులను సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల శాతం పెంచాలని అవసరం ఉందని, అంతే తప్ప సిజేరియన్ ఆపరేషన్లు చేయకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ శాంతకుమారి,మెటర్నిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగ పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయండి

పల్లెపండుగ పనులు ఈ నెల చివరికల్లా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన పంచాయతీ రాజ్, డ్వామా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడువులోపు ఎందుకు పనులు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. రూ.40 కోట్లకు చెందిన పలు పనులను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. సీసీరోడ్లుతోపాటు పశువుల షెడ్లు పూర్తి చేయాలని వెల్లడించారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బాంబు బెదిరింపు


అగ్రికల్చరల్ కళాశాలలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తిరుపతి సిటీ: ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో హ్యూమన్ ఐఈడీ బాంబు పెట్టామంటూ ఆగంతుకుల నుంచి గురువారం ఉదయం కళాశాల అధికారులకు ఈమెయిల్ రావడంతో ఒక్కసారిగా విద్యార్థులు, అధ్యాపకులు ఉలిక్కిపడ్డారు. వెంటనే కళాశాల అధికారులు తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. గతంలో పలు మార్లు కళాశాలకు బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తమై ఫేక్ సమాచారంగా తేల్చారు. అదే రీతిలో మరోమారు కేరళ రాష్ట్రం నుంచి కళాశాలకు మెయిల్ అందినట్లు కళాశాల అధికారులు పోలీసులకు తెలియజేశారు. అప్రమత్తమైన పోలీసులు కళాశాలలోని అన్ని విభాగాలను బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో జల్లెడపట్టారు. ఎంటువంటి బాంబు ఆనవాళ్లు లేవని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. రూరల్ సీఐ చినగోవిందు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని నేషనల్ హైవే రింగ్ రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు గురువారం పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం మేరకు.. నెల్లూరు నుంచి తిరుపతి వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు సుమారు 30 ఏళ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందినట్లు గురువారం పోలీసులకు సమాచారం అందింది. మృతుడు నలుపు రంగు ఫ్యాంటు, తెల్ల రంగు చొక్క, జర్కిన్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి పూర్తి వివరాలు తెలియకపోవడంతో మృత దేహాన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరచినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెలుగు హోమ్ స్టోర్స్ ఏర్పాటు


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు

తిరుపతి అర్బన్: ఈజీ మార్ట్ సంస్థ నేతృత్వంలో వెలుగు హోమ్ స్టోర్స్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు తెలిపారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం ఏసీ, ఏపీఎం, సీసీలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 200 కుటుంబాలకుపైగా ఉన్న గ్రామాల్లో వెలుగులోని పొదుపు సంఘం సభ్యులు హోమ్ స్టోర్స్‌ను ఏర్పాటు చేసుకునే సౌలభ్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. స్టోర్ ఏర్పాటుకు ఆయా పొదుపు సంఘం సభ్యులకు తమ సంఘాల్లో నుంచి రూ.30 వేలు రుణం ఇప్పిస్తామని తెలిపారు. ఆ నగదుతో ఈజీ మార్ట్ ఏజెన్సీ వారికి ఏఏ సరుకులు కావాలో తెలియజేస్తే వారు తక్కువ ధరలకే మీ ఇంటి వద్దకు సరుకులు తెచ్చి ఇస్తారని చెప్పారు. 2 శాతం అదనంగా పెట్టుకుని సరుకులను గ్రామీణ ప్రాంతాల్లో పొదుపు సభ్యులు విక్రయించడానికి వీలుంటుందని తెలిపారు. అయితే కనీసం ఒక్కో సారి రూ.5 వేల సరుకులకు పైగా ఈజీ మార్ట్ వారికి ఆర్డర్స్ ఇవ్వాల్సి ఉంటుందని తెలియజేశారు. 200 కుటుంబాలకు పైగా ఉన్న గ్రామాల్లో ఒక స్టోర్ మాత్రమే పెట్టడానికి వీలుకల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లా అధికారి సతీష్, డీఆర్‌డీఏ ఏపీడీ ప్రభావతి, .డీపీఎం దనంజయరెడ్డి, ఈజీ మార్ట్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మార్ట్స్ స్థానంలో ఈజీ మార్ట్ హోమ్స్ స్టోర్స్

గతంలో వైఎస్సార్‌సీపీ సర్కార్ తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులను జగనన్న మార్ట్స్ పేరుతో ఏర్పాటు చేశారు. రూరల్ ప్రాంతంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోను, అర్బన్ ప్రాంతాల్లో మెప్మా నేతృత్వంలో నెలకొల్పారు. అయితే కూటమి సర్కార్ వాటిని నీరుగార్చింది. తాజాగా తమ నేతృత్వంలో ఏర్పాటు చేసినట్లుగా అదే తరహాలో పొదుపు సభ్యులు హోమ్ స్టోర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి వారికి అవగాహన కల్పిస్తున్నారు.

అపోహలతో ఆందోళన వద్దు

- వలస పక్షులతోనే బర్డ్‌ఫ్లూ వ్యాధి
- ఉష్ణోగ్రతలు పెరిగితే వ్యాధి లక్షణాలు తగ్గుతాయి
- వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సీహెచ్. శ్రీలత


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీలత

తిరుపతి సిటీ: బర్డ్‌ఫ్లూ వ్యాధితో ఆందోళ చెందాల్సిన అవసరంలేదని, అప్రమత్తత, నివారణా చర్యలతో కట్టడి చేయవచ్చని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సీహెచ్. శ్రీలత తెలిపారు. గురువారం వర్సిటీలో ఆమె మీడియాతో మాట్లాడారు. బర్డ్‌ఫ్లూ వ్యాధిని 'అవియన్ ఇన్‌ఫ్లుయన్జా' అంటారని, శీతాకాలంలో తక్కువ ఉష్ణోగ్రతల్లో పక్షులు, కోళ్లకు ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కోళ్లలో శ్వాసకోస లక్షణాలు కనిపిస్తాయని, వలస పక్షలతోనే వ్యాధి సంక్రమణ ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

విదేశాల నుంచి వచ్చే వలస పక్షుల రెక్కలు నీళ్లలో పడి ఆ నీళ్లను కోళ్లు తాగడం వల్ల ఈ వ్యాధి అధికమవుతుందని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరిగితే వ్యాధి లక్షణాలు క్రమంగా తగ్గుముఖం పడతాయన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా ఉభయగోదావరి జిల్లాల్లో ఎక్కువగా కేసులు నమోదయ్యాయని చెప్పారు. కోళ్లు ప్రధానంగా దాణా తినకపోవడం, నోటి నుంచి ద్రవాలు కారడం, తలవాపు, మెడ, కాళ్లు వంకరతిరగడం, నీరసించి నడవలేకపోవడం, నీళ్ల విరోచనాలు వంటివి లక్షణాలుంటే వ్యాధి సంక్రమించినట్లు గుర్తించాలన్నారు. ప్రస్తుతం ఈ వ్యాధికి టీకా లేనందువల్ల నివారణ ఒక్కటే మార్గమని చెప్పారు. వ్యాధి సోకిన కోళ్లఫారాల నుంచి రవాణాను అరికట్టడం, పౌల్ట్రీల్లో పనిచేసే వ్యక్తులు పీపీఈ కిట్లను ఉపయోగించడం, మరణించిన కోళ్లను పూడ్చిపెట్టడం, విధిగా బ్లీచింగ్ వాడాలని సూచించారు. వ్యాధి సోకిన కోడిమాంసాన్ని వాడకుండా, ఆరోగ్యవంతమైన కోడిమాంసాన్ని, గుడ్లను 100డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికించి తీసుకోవచ్చని చెప్పారు. కోళ్ల రైతులు పౌల్ట్రీల్లో అప్రమత్తంగా ఉండాలని ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

కుమారస్వామి ఆలయంలో మాంసాహారం


కుమారస్వామి ఆలయ ముఖ ద్వారం వద్ద మాంసాహారం తింటున్న కూలీలు

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి ఆలయంలో గురువారం అపచారం జరిగింది. ఆలయ నిర్మాణ పనులు చేసే కార్మికులు చికెన్ బిర్యానీ తెచ్చుకుని అక్కడే భుజించారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి దీనిపై భక్తులు మండిపడుతున్నారు. పట్టణంలో ఉన్న ఈ ఆలయంలో నిత్యం ధూప దీప నైవేద్యాలు జరగడంతోపాటు సెక్యూరిటీ సిబ్బంది కూడా ఉంటారు. అయినా భవన నిర్మాణం చేసే కార్మికులు మాంసాహారం భుజిస్తున్నా సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోలేదు.

నడక మార్గంలో చిరుత

తిరుమల: అలిపిరి నడక మార్గంలోని ఏడో మైలు వద్ద గురువారం చిరుత సంచరించినట్లు భక్తులు పేర్కొన్నారు. నడక మార్గంలో ఏడో మైలు వద్దకు వెళుతున్న సమయంలో చిరుత కనిపించడంతో భక్తులు దాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. వెంటనే విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు, టీటీడీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు. ఆ ప్రాంతమంతా భక్తులను అప్రమత్తం చేస్తూ.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

బాత్రూంలో బాలుడి మృతి


శరణేష్ మృతదేహం

తడ: స్నానం చేసేందుకు బాత్రూంలోకి వెళ్లిన బాలుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని రామాపురం పంచాయతీ, వెంకటాద్రిపాళెం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కొండపనాయుడుకి అందిన ఫిర్యాదు మేరకు.. గ్రామానికి చెందిన పళని కుమారుడు శరణేష్(13) ఈ నెల 12వ తేదీ బుధవారం రాత్రి ఇంట్లోని బాత్రూంలో స్నానానికి వెళ్లాడు. బాలుడు ఎంతకీ బయటకు రాకపోవడంతో తలుపు తట్టిన కుటుంబ సభ్యులు లోపల నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఆందోళనతో బాత్రూం తలుపు పగులగొట్టారు. లోనికి వెళ్లి చూడగా శరణేష్ వేసుకున్న బనియన్ సగం అతని గొంతుకు మరో సగం గోడకు ఉన్న షర్ట్ హ్యాంగర్‌కి తగులుకుని అపస్మారక స్థితిలో పక్కకు ఒరిగి పోయి ఉన్నాడు. హుటాహుటిన బాలుడిని తమిళనాడు పరిధిలోని ఏళావూరు చెక్‌పోస్టు వద్ద ఉన్న ఆసుపత్రికి తరలించగా అతను అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై మృతుడి తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలి


సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

నాగలాపురం: ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ సూచించారు. గురువారం ఆయన పిచ్చాటూరులో పర్యటించి, సీసీ రోడ్డు, మిని గోకులం షెడ్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి జాబ్ కార్డుకు 100 రోజులు పని కల్పించాలన్నారు. మిని గోకులం షెడ్డును నిర్మించిన రైతులకు బిల్లులు చేయాలన్నారు. మండలంలో కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఉపాధి హామీ ఏపీఓ నాగభూషణమ్మ అన్నారు. అలాగే ప్రతి ఇంటికీ ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ రఫీ, ఏపీఓలు చంద్రకళ, చంద్రశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బెంచీలకు పసుపు రంగులా?

తార స్థాయికి 'పచ్చ'పిచ్చి

- రంగులు వేయకుండా అడ్డుకున్న బందార్లపల్లి, రామిరెడ్డిపల్లె వాసులు
- పోలీసులను ఆశ్రయించిన పెయింటర్లు, ఒప్పుకోని మహిళలు


బందార్లపల్లిలో సిమెంటు బెంచీకి పసుపు రంగు వేస్తున్న పెయింటర్


రంగులు వేస్తున్న పెయింటర్లకు మద్దతుగా వచ్చిన సచివాలయ ఉద్యోగులను నిలదీస్తున్న గ్రామస్తులు

పాకాల: గత ప్రభుత్వంలో తుడా నిధులతో చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా పల్లెల్లో ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలకు పసుపు రంగులు అద్దుతుండడం తీవ్ర దుమారం రేపుతోంది. అప్పటి ఎమ్మెల్యే, తుడా చైర్మన్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనుల ఆనవాళ్లను చెరిపేయాలన్న లక్ష్యంతో రంగుల కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటిదే చంద్రగిరి నియోజకవర్గంలో గురువారం చోటు చేసుకుంది.. వివరాలు.. పాకాల మండలం, బందార్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలకు పసుపు రంగు వేయడానికి గురువారం కొంతమంది పెయింటర్లు వెళ్లారు.

అడ్డుకున్న మహిళలు

గ్రామంలోని వీధుల్లో ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలకు పసుపు రంగులు వేస్తుండగా మహిళలు అడ్డుకున్నారు. బెంచీలకు పసుపు రంగులు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. అయితే పెయింటర్ల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. గత ప్రభుత్వంలో వేసిన బెంచీలపై చెవిరెడ్డి పేరు చెరపివేయాలనే కదా..? మీ ఉద్దేశం.. ఆయన పేరును చెరపగలరేమో కానీ చేసిన అభివృద్ధిని చెరపలేరు కదా..? మీకు చేతనైతే మీరు కూడా ఇలాంటి బెంచీలు తయారు చేయించి అప్పుడు పసుపు రంగు వేసుకోండి.. మా గ్రామంలో సిమెంటు బెంచీలకు రంగులు వేస్తామంటే ఒప్పుకునేది లేదంటూ అడ్డుకున్నారు. ప్రభుత్వ అధికారులే పసుపు రంగులు అద్దమని తమకు కాంట్రాక్టు ఇచ్చారని పెయింటర్లు చెప్పారు. అనంతరం కార్మికులు, గ్రామస్తుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

ఇష్టానుసారం

చంద్రగిరి : మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి పంచాయతీలో సిమెంట్ బెంచీలకు పసుపు రంగు వేయడంపై గ్రామస్తులు ఎదురు తిరిగారు. పాకాలవారిపల్లికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి మూడు మండలాలకు సబ్‌కాంట్రాక్టు తీసుకుని ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.


ఇది న్యాయమా మీరే చెప్పండి?

విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి ప్రభుత్వ అధికారుల ఆదేశాలతో రంగులు వేస్తున్న వారిని ఎలా అడ్డుకుంటారని గ్రామస్తులను ప్రశ్నించారు. చెవిరెడ్డి పేరు కనబడకుండా చేసి పసుపు రంగులు వేయడమేంటి..? మీరే చెప్పాలని గ్రామస్తులు ఎదురు ప్రశ్న వేశారు. దీంతో పోలీసులు ఏం సమాధానం చెప్పాలో తెలియక ప్రభుత్వ అధికారులు పంపిస్తే వాళ్లు రంగులు వేయడానికి వచ్చారు. అనవసరంగా వారితో గొడవలు పడకండని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా గ్రామస్తులు ససేమిరా అనడంతో పెయింటర్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు



దేశవ్యాప్తంగా 2020–22 మధ్య ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగాయి. జాతీయ నేర గణాంక విభాగం లెక్కల ప్రకారం.. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో ఎస్సీలపై దాడులు ఎక్కువ జరిగితే.. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఒడిశా రాష్ట్రాల్లో ఎస్టీలపై దాడులు చాలా ఎక్కువ జరిగాయి. ఆ మూడేళ్లలో ఎస్సీలపై దాడులకు సంబంధించి 1.58 లక్షలకుపైగా కేసులు నమోదైతే, ఎస్టీలకు సంబంధించినవి 27వేలకు పైగా నమోదయ్యాయి. ఎస్సీ, ఎస్టీ మహిళలపై జరిగిన దాడుల్లో అత్యధికం అత్యాచార కేసులే.



కాలు కదపకుండా కోరిన సర్వీస్

పెరుగుతున్న 'ఆన్ డిమాండ్ హోమ్ సర్వీసెస్'

ఫోన్ చేయగానే ఇంటికే వస్తున్న వస్తువులు



సాక్షి, అమరావతి: ఒకప్పుడు ఇంటికి కిరాణా సరుకులు కావాలంటే దుకాణానికి వెళ్లే వారు. ఫ్యాన్సీ వస్తువులు కావాలన్నా షాపులోనే కొనేవారు. మొబైల్ కావాలంటే పది దుకాణాలు తిరిగేవారు. ఇంట్లో కరెంటు రిపేర్లకు ఎలక్ట్రీషియన్ దగ్గరికి వెళ్లో లేదా ఫోన్ చేసో పిలిపించుకోవాల్సిందే. టీవీ, ఫ్యాను, మిక్సీ వంటివి పాడైతే కంపెనీ సర్వీస్ సెంటర్‌కో, రిపేర్ షాపుకో పట్టుకెళ్లేవారు. ఇప్పుడు ఏ పనికీ ఎక్కడికీ వెళ్లనవసరం లేదు. కావాల్సిన సరుకులు యాప్‌లో ఆర్డర్ పెడితే ఇంటికొచ్చేస్తున్నాయి. విద్యుత్ పరికరం ఏది పాడైనా మొబైల్ యాప్స్ ద్వారానే టెక్నీషియన్లు ఇంటికే వచ్చి రిపేరు చేస్తున్నారు. ఇంటిని శుభ్రం చేయడం, తోటమాలి, ఇంటి పని, వంట మనిషి సేవలు, దుస్తులు ఉతకడం, ఇస్త్రీ చేయడం, కారు, బైక్ వాష్, ఏసీ, వాటర్ హీటర్, వాటర్ ప్యూరిఫైయర్ మరమ్మతులతో పాటు హెల్త్ కేర్ సేవలు, వైద్యం, బ్యూటీ, సెలూన్ సర్వీసెస్, ఫిట్‌నెస్ కోచ్, ట్యూటర్, ఫిజియోథెరపీ, బేబీ సిట్టింగ్, పెట్ కేర్, ఫుడ్ డెలివరీ, ట్రావెల్, ట్రాన్స్‌పోర్ట్ వంటి అనేక సేవలు ఇప్పుడు ఇంటి ముంగిటకే వచ్చి వాలుతున్నాయి. కొంత కాలం క్రితం వరకూ ఈ వెసులుబాటు కొన్నింటికే ఉండేది. ఇప్పుడు అన్ని సేవలూ ఆన్‌లైన్ ద్వారానే అందుతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా జరగని పని అంటూ ఒక్కటీ కనిపించదు. అనేక సంస్థలు 'ఆన్ డిమాండ్ హోమ్ సర్వీసెస్' అందిస్తున్నాయి. గూగుల్‌లో మనకు ఏది అవసరమో టైప్ చేస్తే ఆ సేవలందించే సంస్థలు, వాటి రేటింగ్‌లతో సహా వస్తాయి. మనం ఎంచుకొన్న సంస్థకు ఫోన్ చేసినా, లేదా వాళ్ల యాప్‌లో అప్లై చేసినా నిర్దేశిత సమయంలో ఇంటికే వచ్చి ఆ సేవలందించి వెళ్తారు.



'ఆన్ డిమాండ్ హోమ్ సర్వీసెస్' మార్కెట్ విలువ చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ మార్కెట్ ప్రస్తుత టర్నోవర్ 5,790 మిలియన్ డాలర్లు. ఇది 2030 నాటికి 14,785 మిలియన్ డాలర్లకు చేరుతుందని 'హోరిజన్ గ్రాండ్ వ్యూ రీసెర్చ్' అనే అంతర్జాతీయ పరిశోధన సంస్థ ఇటీవల వెల్లడించింది. మన దేశంలోనూ ప్రస్తుతం 284 మిలియన్ డాలర్లుగా ఉన్న ఈ మార్కెట్ 2030 నాటికి 1,092 మిలియన్ డాలర్లకు పెరుగుతుందని తెలిపింది. అయితే ఈ మార్కెట్‌కు నిపుణుల కొరత ఓ సమస్య. కొందరు గృహాల్లోకి అపరిచిత వ్యక్తులను రానివ్వరు. ఇది మరో సమస్య. వచ్చే వారికి లైసెన్స్, ఐడెంటిటీ కార్డులు వంటివి లేకపోవడం వారి భయానికి కారణం. అయినప్పటికీ మార్కెట్ విస్తరిస్తూనే ఉంది. దీంతో అమెజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా హోమ్ సర్వీసెస్ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నాయి.



విజయవాడ కరెన్సీనగర్‌లో కారును శుభ్రం చేస్తున్న ఈ వ్యక్తి పేరు మంజల్. అసోం రాష్ట్రం నుంచి బతుకుతెరువు కోసం ఇక్కడికి వచ్చాడు. ఇక్కడ 'మొబైల్ కార్ వాష్' పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించాడు. అతనితో వచ్చిన మరో యువకుడు కూడా ఈ సంస్థలో చేరాడు. ఓ వ్యానులో నీళ్లు, అవసరమైన యంత్రాలు, ఓ జనరేటర్ అమర్చుకున్నారు. ఫోన్ చేస్తే ఇంటి వద్దకే వచ్చి కారు, బైక్‌ను శుభ్రంగా కడిగేసి, పాలిష్ పెట్టిస్తారు. వాహనదారులు కార్ వాష్ వద్ద ఎంత చెల్లిస్తారో వీళ్లు అంతే తీసుకుంటారు. దీనివల్ల ఎక్కడెక్కడికో వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. సమయం ఆదా అవుతుంది.

- ఇటీవల కాలంలో ఇలా ఇంటి వద్దకే అందే హోమ్ సర్వీసెస్ విస్తృతమవుతున్నాయి.

స్వయం ఉపాధి, ఉద్యోగాలు

'గుడ్ మార్నింగ్ సార్.. నమస్తే మేడమ్.. చెప్పండి మేం మీకే విధంగా సాయపడగలం'.. ఏదైనా హోమ్ సర్వీసెస్ సంస్థకు ఫోన్ చేయగానే వినిపించే మాటలివి. పాలు, కూరగాయల దగ్గర్నుంచి.. ఖరీదైన కార్ల వరకూ ఏది కావాలన్నా, ఎప్పుడు కొనాలన్నా ఇంట్లోనే కూర్చుని ఫోన్ ద్వారానే తెప్పించేసుకోవచ్చు. ఈ హోమ్ సర్వీసెస్ ద్వారా ఎంతో మందికి ఉద్యోగాలు దొరుకుతున్నాయి. నచ్చిన సమయంలో పని చేసే వెసులుబాటూ ఉంది. దీంతో పని చేసేందుకు వచ్చే వారూ వెనుకాడటం లేదు. మరి కొంతమంది యువత ఈ వ్యాపారన్నే స్వయం ఉపాధిగా మలచుకొని పలువురికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

క్లుప్తంగా...

శివరాత్రికి 3,500 ప్రత్యేక బస్సులు



సాక్షి, అమరావతి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలో 99 శైవ క్షేత్రాలకు 3,500 ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని డిపో మేనేజర్లను ఆదేశించింది. శైవ క్షేత్రాల్లో బస్ డిపోల వద్ద తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రయాణికులకు సమాచారం అందించేందుకు మైక్ సిస్టంను ఏర్పాటు చేయాలని పేర్కొంది.

వైఎస్సార్‌సీపీ గుంటూరు నగర పార్టీ అధ్యక్షురాలిగా షేక్ నూరి ఫాతిమా

పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా రమేశ్ గౌడ్, రవిశంకర్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు షేక్ నూరి ఫాతిమాను గుంటూరు నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలిగా నియమించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా చిట్లూరు రమేశ్ గౌడ్(అనంతపురం), రాచమల్లు రవిశంకర్ రెడ్డి (వైఎస్సార్ జిల్లా)లను నియమించారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్

గన్నవరం: కృష్ణా జిల్లా గన్నవరంలోని టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో 31 మంది వైఎస్సార్‌సీపీ నేతల ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు గురువారం డిస్మిస్ చేసింది. అయితే, ఒకరికి మాత్రం అనారోగ్య కారణాల రీత్యా ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది. వివరాలిలా ఉన్నాయి... రెండేళ్ల క్రితం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడి కేసులో ఇప్పటివరకు పోలీసులు, సీఐడీ అధికారులు 45 మందిని అరెస్ట్ చేశారు. మరో 32 మంది ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించగా, ముందు ట్రయిల్ కోర్టులో పిటిషన్ వేయాలని, రెండు వారాలపాటు వారిపై చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో ముందస్తు బెయిల్‌పై వాదనలు బుధవారంతో ముగిశాయి. మొత్తం 32 మందికిగాను 31 మంది ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. ఈ కేసులో మన్నె సుందరరావుకు అనారోగ్య కారణాల రీత్యా ముందస్తు బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. ఇప్పటికే విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఆరుగురితోపాటు తోట వెంకయ్య, హేమంత్, మట్టా నవీన్‌లకు రెగ్యులర్ బెయిల్‌ను కోర్టు ఇచ్చింది.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా గౌతమ్‌కుమార్

సాక్షి, అమరావతి: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఏపీ నూతన అధ్యక్షుడిగా బందెల గౌతమ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ నెల 10న పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి గౌతమ్‌కుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు ఎంటీఎస్, హెచ్ఆర్ ఇవ్వాలి

జాయింట్ యాక్షన్ కమిటీ వినతి

సాక్షి, అమరావతి: నేషనల్ హెల్త్ మిషన్‌లోని అన్ని క్యాడర్ల ఉద్యోగులకు ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు గురువారం హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కి వినతి పత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం హెచ్ఆర్ సెల్ ఏర్పాటు చేసి, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు.

వల్లభనేని వంశీ అరెస్టు

అర్ధరాత్రి కోర్టులో హాజరుపర్చిన పోలీసులు.. 2 గంటల వరకూ కొనసాగిన వాదనలు

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్/పటమట/కృష్ణలంక (విజయవాడ తూర్పు)/కోనేరు సెంటర్ (మచిలీపట్నం): కృష్ణాజిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని విజయవాడ పటమట పోలీసులు గురువారం ఉదయం హైదరాబాద్‌లో నాటకీయ పరిణామాల మధ్య అరెస్టుచేశారు. ఉదయం ఏడు గంటలకు అయన్ను అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించారు. రెండేళ్ల క్రితం గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్, దాడి చేశారనే ఆరోపణలతో పోలీసులు ఆయనపై బీఎన్ఎస్ క్లాజ్ 140 (1), 308, 351 (3) ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. అంతకుముందు.. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏడీసీపీ రామకృష్ణ తన బృందంతో హుటాహుటిన హైదరాబాద్ చేరుకుని వంశీ కోసం గాలింపు చేపట్టారు. రాయదుర్గం మైహోం భుజాలోని తన ఇంట్లో ఉన్నట్లు తెలుసుకుని అక్కడకెళ్లి వంశీకి బీఎన్ఎస్ఎస్ 47 (1) నోటీసును అందించి ఉన్నపళంగా అరెస్టు చేశారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో మధ్యాహ్నం విజయవాడకు తీసుకొచ్చారు. కొద్దిసేపు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఉంచి, అనంతరం కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ కేసు విచారణ అధికారిగా వ్యవహరిస్తున్న సెంట్రల్ ఏసీపీ కె. దామోదరరావుతోపాటు లా అండ్ ఆర్డర్ ఏడీసీపీ జి. రామకృష్ణ రాత్రి తొమ్మిది గంటల వరకు వంశీని ఎనిమిది గంటలపాటు విచారించారు. అనంతరం.. వైద్య పరీక్షల నిమిత్తం ఆయన్ను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరోవైపు.. వంశీ అనుచరులైన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన ఏలినేని వెంకట శివరామకృష్ణప్రసాద్ (35), కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన నిమ్మ లక్ష్మీపతి (35)లను కూడా పటమట పోలీసులు గురువారం రాత్రి అరెస్టుచేశారు. వైద్య పరీక్షల నిమిత్తం వారినీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం.. వంశీని కోర్టులో హాజరుపరచగా అర్ధరాత్రి 2 గంటల వరకు వాదనలు కొనసాగాయి.



వంశీని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చిన పోలీసులు

న్యాయ వ్యవస్థ అంటే లెక్కలేనట్లుగా..

ఇక రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో భాగంగా చంద్రబాబు ప్రభుత్వం వేధింపులతో బరితెగిస్తోందనడానికి వంశీ అరెస్టే ఉదాహరణ. ఎందుకంటే.. ఏకంగా న్యాయమూర్తి ఎదుట స్వచ్ఛందంగా 164 సీఆర్‌పీసీ కింద నమోదుచేసిన వాంగ్మూలాన్ని కూడా బేఖాతరు చేస్తూ అక్రమ కేసులకు టీడీపీ కూటమి సర్కారు తెగిస్తోంది. అసలు వంశీపై అక్రమ కేసుకు ప్రాతిపదికగా పోలీసులు చెబుతున్న గన్నవరం టీడీపీ ఆఫీసు కంప్యూటర్ ఆపరేటర్ ముదునూరి సత్యవర్ధన్ ఫిర్యాదే అబద్ధమని కోర్టు సాక్షిగా ఇటీవల తేలిపోయింది. ఖాళీ కాగితాలపై తన సంతకం తీసుకుని ఫిర్యాదు చేశారని.. అసలు ఫిర్యాదులో ఏముందో కూడా తనకు తెలియదని సత్యవర్ధన్ సాక్షాత్తూ న్యాయమూర్తి ఎదుట స్పష్టం చేశారు. వంశీ తనను బెదిరించనేలేదని.. తనపై దౌర్జన్యం చేయలేదని స్వచ్ఛందంగా వెల్లడించి తన ఫిర్యాదును వాపసు తీసుకున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలు ఇది అవమానంగా భావించి ఎలాగైనా వంశీని అరెస్టుచేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో సుదీర్ఘ చర్చల అనంతరం సత్యవర్ధన్ కిడ్నాప్ పన్నాగం పన్నినట్లు తెలుస్తోంది. మరోవైపు.. పోలీసులు సైతం కోర్టులోని పరిణామాలన్నింటినీ బేఖాతరు చేస్తూ రెడ్‌బుక్ కుట్రనే కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో సత్యవర్ధన్ తమ్ముడు కిరణ్‌పై ఒత్తిడి తెచ్చి అవాస్తవ ఆరోపణలతో మరో అబద్ధపు ఫిర్యాదును ఈ నెల 12న ఇప్పించారు. మాజీ ఎమ్మెల్యే వంశీ, కొమ్మా కోట్లు, భీమవరపు రామకృష్ణ, గంటా వీర్రాజు తదితరులు తన సోదరుడిని కిడ్నాప్ చేసి కేసు వాపసు తీసుకునేలా బెదిరించి, భయపెట్టారని అందులో పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన వెంటనే పటమట పోలీసులు వంశీపై అక్రమ కేసు నమోదు చేశారు. అంటే.. తమకు అసలు న్యాయ వ్యవస్థ అంటే ఏమాత్రం లెక్కలేదన్నట్లుగా చంద్రబాబు ప్రభుత్వం బరితెగిస్తోందన్నది వంశీ అరెస్టు ద్వారా స్పష్టమవుతోంది. కాగా, వంశీ అరెస్టుపై విజయవాడ పటమట పోలీసుస్టేషన్‌లో గురువారం హైడ్రామా నడిచింది. హైదరాబాదు నుంచి వంశీని పటమట స్టేషన్‌కు తీసుకొస్తారని పోలీసులు లీకులు ఇవ్వడంతో మీడియా అంతా అక్కడికి చేరుకుంది. చివరికి భవానీపురం స్టేషన్‌కు, అక్కడ వంశీని కారుమార్చి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో రైటర్, ఇతర సిబ్బంది కేసుకు సంబంధించిన పత్రాలను రహస్యంగా తరలించారు.

సత్యవర్ధన్ స్టేట్‌మెంట్ రికార్డు..

మరోవైపు ముదునూరు సత్యవర్ధన్ గురువారం సాయంత్రం పటమట పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు. ఆయన్ను పోలీసులు రహస్యంగా స్టేషన్‌లో ఉంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. వంశీ అరెస్టు నేపథ్యంలో సత్యవర్ధన్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయటం చర్చనీయాంశంగా మారింది.

మాజీమంత్రి పేర్ని నాని హౌస్ అరెస్టు..

వంశీ అరెస్టు నేపథ్యంలో కృష్ణాజిల్లా మచిలీపట్నంలో మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నానిని పోలీసులు గురువారం హౌస్ అరెస్టు చేశారు. తెల్లవారుజామున ఆయన ఇంటి వద్దకు పోలీసులు భారీగా చేరుకుని బయటికెళ్లేందుకు వీల్లేదని నోటీసులిచ్చారు.

ఎఫ్ఐఆర్ అడిగితే ఇవ్వడంలేదు..



నా భర్తపై నమోదుచేసిన కేసు ఎఫ్ఐఆర్ అడిగితే ఇవ్వడంలేదు. ఎందుకు అరెస్టు చేశారో చెప్పడంలేదు. రిమాండుకు తీసుకెళ్లినప్పుడు ఇస్తామంటున్నారు. ఎఫ్ఐఆర్ లేకపోతే లీగల్‌గా వెళ్లడానికి అవకాశం ఉండకూడదని ఇలా చేస్తున్నారు. హైదరాబాద్‌లో మా ఇంటికొచ్చి అరెస్టుచేశారు. నోటీసు ఇవ్వకుండా ఎందుకు అరెస్టుచేస్తున్నారని ప్రశ్నిస్తే అప్పటికప్పుడు పేపర్‌పై రాసిచ్చారు. అక్రమ కేసులో ఇరికించేందుకే ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్ నుంచి వస్తుంటే తెలంగాణ సరిహద్దుల వద్దే ఏపీ పోలీసులు నన్ను అడ్డుకున్నారు. నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్మోహనరావు సహాయంతో ఇక్కడకు చేరుకున్నాను.

– పంకజశ్రీ, వంశీ సతీమణి

చంద్రబాబు ఒత్తిడితోనే వంశీ అక్రమ అరెస్టు

మాజీ మంత్రి అంబటి



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ఒత్తిడితోనే గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. వంశీ అక్రమ అరెస్టు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిపై తప్పుడు కేసులపై డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను కలిసి వినతి పత్రాలు ఇచ్చేందుకు అంబటి రాంబాబు, మాజీ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులతో కూడిన వైఎస్సార్‌సీపీ బృందం గురువారం అపాయింట్‌మెంట్ తీసుకుని డీజీపీ కార్యాలయానికి వెళ్లింది. అయినా డీజీపీ కలవలేదు. అనంతరం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీపై ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ తాను ఆ ఫిర్యాదు చేయలేదని, సాక్షి సంతకం తీసుకొని, దానితో వంశీపై తప్పుడు ఫిర్యాదు నమోదు చేశారంటూ మేజిస్ట్రేట్ వద్ద వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. దీంతో చంద్రబాబు, లోకేశ్ కుతంత్రాలు బట్టబయలయ్యాయని చెప్పారు. సత్యవర్ధన్‌ను వంశీ కిడ్నాప్ చేసి, బెదిరించి తప్పుడు వాంగ్మూలం ఇప్పించారంటూ అతని సోదరుడితో ఫిర్యాదు చేయించారని తెలిపారు. వంశీని పోలీసులు క్షణాల్లో అరెస్ట్ చేశారన్నారు. బుధవారం ఓ వివాహ వేడుకలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేసిన రచ్చలో మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పైనా తప్పుడు కేసులు పెట్టారని తెలిపారు.

తప్పుడు కేసులతో వంశీపై కక్షసాధింపు



వల్లభనేని వంశీపై పోలీసులు బనాయించిన తప్పుడు కేసును తక్షణం ఉపసంహరించుకోవాలి. రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పోలీసులను పావుగా వాడుకుని వంశీపై తీవ్ర సెక్షన్లతో కేసులు నమోదుచేశారు. రాష్ట్రంలో చట్టాలను ఎలా తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారో వంశీ అరెస్టు ఉదంతం ఒక నిదర్శనం. అధికారం శాశ్వతం కాదని పోలీసులు గుర్తించాలి.

– మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే

అరెస్టు చేయొద్దని కోర్టు చెప్పినా..



వల్లభనేని వంశీని అరెస్టు చెయ్యొద్దని కోర్టు ఆదేశాలున్నా, పోలీసులు వాటిని ధిక్కరించి మరీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారం చేతిలో ఉంటే ఏం చేసినా చెల్లుబాటవుతుందనే పిచ్చి భ్రమల్లో నుంచి కూటమి నాయకులు బయటకు రావాలి. నియంత పాలన ఎంతోకాలం సాగదు. అన్యాయం జరిగిందని న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే, బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్న దౌర్భాగ్య పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి.

– జూపూడి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తప్పుడు ఫిర్యాదు చేయించి..



ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారమే పాలన సాగుతోంది. వంశీపై రాజకీయ కక్ష సాధింపులకే పోలీసులను ప్రయోగించి తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. వంశీ కేసు పూర్తిగా నీరుగారిపోతోందని చంద్రబాబు, లోకేశ్ కక్షపూరితంగా సత్యవర్ధన్ కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి వారితో తప్పుడు ఫిర్యాదు చేయించారు. ఇలాంటి దుర్మార్గ విధానాలకు ప్రభుత్వ పెద్దలే పాల్పడుతుంటే ఈ రాష్ట్రంలో ఎవరికైనా న్యాయం జరుగుతుందా?

– వేల్పుల రవికుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

ఇష్టారాజ్యంగా అక్రమ కేసులు

- వల్లభనేని వంశీ అరెస్టుని ఖండిస్తున్నాం
- 'మండలి' విపక్ష నేత బొత్స సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం: విపక్షంపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అక్రమంగా అరెస్టుచేశారని, ఈ అరెస్టును వైఎస్సార్‌సీపీ పూర్తిగా ఖండిస్తున్నట్లు ఏపీ శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. పాలన చేతకాక, హామీలు అమలుచేయలేక వైఎస్సార్‌సీపీ నాయకులపై ఇష్టారాజ్యంగా అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడం తప్ప ఈ ప్రభుత్వం సాధించింది శూన్యమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం కారణంగా పోలీస్ వ్యవస్థను కోర్టులతో చీవాట్లు పెట్టిస్తున్నారని.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడునెలలైనా ఇప్పటివరకూ పాలన గాడిలో పడలేదని, అన్నింటికీ వైఎస్సార్‌సీపీని నిందించడం పరిపాటిగా మారిందన్నారు. ఫ్రీహోల్డ్ భూముల్లో అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిన కూటమి నాయకులు, దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని బొత్స గురువారం విశాఖలో మీడియా సమావేశంలో సవాల్ చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ఒక్కో డిపార్ట్‌మెంట్‌లో ఏడు వేల నుంచి 10 వేల ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని స్వయంగా చంద్రబాబే చెబుతున్నారు. అధికారులకు, మంత్రులకు సమన్వయంలేదని ఆయన మాటలతో స్పష్టంగా అర్థమవుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్నా చంద్రబాబు ఇంకా పాలన గాడిలో పెట్టలేకపోయారు. అప్పులు తేవడం గురించి వార్తలు కనిపిస్తున్నాయే తప్ప.. అభివృద్ధి ఎక్కడా కనిపించడంలేదు. రకరకాల పన్నులు, విద్యుత్ చార్జీల పెంపు రూపంలో ప్రజల మీద భారం మోపుతున్నారు. వీటికి ధరల దరువు అదనం. మా ప్రభుత్వంలో విద్యా రంగానికి ఎంతో మేలుచేసినా విషప్రచారం చేశారు. కానీ, ఇంగ్లిష్ భాష మీద పట్టున్న వారికే ఉన్నతోద్యోగాలు దక్కుతున్నాయని నీతి ఆయోగ్ స్పష్టంచేసింది. మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొన్నారు.

ఆందోళన అక్కర్లేదు

మనుషులకు అత్యంత అరుదుగా బర్డ్ ఫ్లూ.. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎవరికీ సోకలేదు

జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కోళ్లకు ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా (హెచ్5ఎన్1–బర్డ్ ఫ్లూ) వేగంగా సోకుతోంది. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక వ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకిందనే వార్త గురువారం కలకలం రేపింది. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో ఇప్పటి వరకు మనుషులకు బర్డ్ ఫ్లూ నమోదైన ఘటనలు చోటు చేసుకోలేదని వైద్య శాఖ స్పష్టం చేసింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని వైద్యులు భరోసా ఇస్తున్నారు. పక్షుల నుంచి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశం అత్యంత అరుదుగా ఉంటుందని స్పష్టం చేశారు. వ్యాధి బారినపడిన పక్షులకు దగ్గరగా ఉండే వ్యక్తులకు అరుదుగా ఈ వైరస్ సోకే అవకాశం ఉంటుందని, మనుషుల నుంచి మనుషులకు సోకిన సందర్భాలు లేవన్నారు. ఇక మనుషుల్లో బర్డ్ ఫ్లూ ఔట్ బ్రేక్స్ ఇప్పటి వరకూ సంభవించలేదని తెలిపారు. మనుషులకు వ్యాధి సోకినట్టైతే జ్వరం, దగ్గు, గొంతు మంట, ఒళ్లు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు వస్తాయన్నారు. ఈ వ్యాధి నుంచి రక్షణ కోసం పౌల్ట్రీ ఉత్పత్తులను బాగా ఉడికించిన తర్వాతే ఆహారంగా తీసుకోవాలని, వ్యాధి బారినపడిన కోళ్లు, జంతువులకు దూరంగా ఉండాలని వైద్య శాఖ సూచిస్తోంది. ఈ తరహా కేసులు వ్యక్తుల్లో ఇప్పటి వరకు రాష్ట్రంలో వెలుగు చూడలేదు. గత పదేళ్లలో దేశ వ్యాప్తంగా రెండు హెచ్5ఎన్1, రెండు హెచ్9ఎన్2 కేసులు వెలుగు చూశాయి. 2019లో మహారాష్ట్రలో ఒకటి, 2021 జూలైలో హర్యానాలో ఒకటి, గతేడాది ఏప్రిల్, మే నెలల్లో పశ్చిమ బెంగాల్‌లో ఒక్కొక్కటి చొప్పున రెండు కేసులు నమోదయ్యాయి. 2003 నుంచి 2023 వరకు పశ్చిమ పసిఫిక్‌లో 248 కేసులు నమోదయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాదిలో 60 కేసులు నమోదైనట్లు వెల్లడైంది. కర్నూలు జిల్లాలో 15 బాతులు మృతి చెందగా..వాటికి బర్డ్ ఫ్లూ లేదని అధికారులు నిర్ధారించారు. తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ కారణంగా కోళ్ల మృత్యువాత పడ్డాయి. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆయా జిల్లాల్లోని కోళ్ల ఫారాల్లో పని చేసే సిబ్బందిని వైద్య శాఖ స్క్రీనింగ్ చేస్తోంది. బుధవారం నాటికి 584 మందిని స్క్రీనింగ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో 18 మంది నుంచి నమూనాలు సేకరించి కాకినాడ రంగరాయ కళాశాలలో పరీక్షించగా నెగిటివ్‌గా నిర్ధారణ అయింది. మరోవైపు విజయవాడ, కర్నూలు, విశాఖ బోధనాస్పత్రుల్లో 10 పడకల ఐసోలేషన్ వార్డులను అందుబాటులో ఉంచారు.



మార్గదర్శకాలు పాటించాలి

రాష్ట్రంలో రెండు మూడు జిల్లాల్లో కోళ్లకు వ్యాపించిన బర్డ్ ఫ్లూ వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. గురువారం ఆయన రాష్ట్ర సచివాలయం నుంచి పశు సంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, చనిపోయిన కోళ్లను సక్రమంగా పూడ్చి పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి కలెక్టర్లు, పశు సంవర్ధక శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా స్టాండర్డ్ ప్రొటోకాల్ మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటిని పాటించాలన్నారు. వ్యాధి సోకిన ప్రాంతానికి ఒక కిలోమీటరు పరిధిని రెడ్ జోన్‌గా ప్రకటించి, అక్కడికి రాకపోకలను, దాణా రవాణాను నియంత్రించాలని స్పష్టం చేశారు. ఒకటి నుంచి తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో ముందు జాగ్రత్తలు చేపట్టాలని, పశు సంవర్ధక శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ విషయంలో ప్రసార మాధ్యమాల్లో ఏవైనా తప్పుడు వార్తలు వస్తే ఆందోళన చెందొద్దని, అలాంటి వార్తలు ప్రసారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బర్డ్ ఫ్లూ సోకిన ఏలూరు జిల్లా బాదంపూడి, పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరు, కానూరు, ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం ప్రాంతాల్లోని 5 ఫార్మ్‌ల్లో చేపట్టిన చర్యలపై ఆయన ఆరా తీశారు. ఢిల్లీ నుండి కేంద్ర పశు సంవర్ధక శాఖ కమిషనర్ డా.అమిత్ మిత్రా మాట్లాడుతూ సరే కోళ్ల ఫారాలను తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలని చెప్పారు. కాగా, ఏలూరు జిల్లా బాదంపూడిలో బర్డ్‌ఫ్లూ వల్ల ఎవరూ మరణించలేదని కలెక్టర్ ప్రకటించారు.

రాష్ట్రానికి కేంద్ర బృందాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ తీవ్రతపై అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు వచ్చాయని మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీ కూడా శుక్రవారం రాష్ట్రానికి వస్తారని చెప్పారు. గురువారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు.